# థేంక్స్ టు ది...

- దివాకర్ మల్లంపల్లి




తెల తెలవారుతున్నది. గోదావరి ఎక్స్‌ప్రెస్ వచ్చి సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. క్షణంలో అక్కడి వాతావరణం కోలాహలంగా మారింది.

ట్రయిన్ దిగిన ఆనందరావు కాఫీ త్రాగుతూ ఆ సందడిని ఎంజాయ్ చేస్తున్నాడు. అంతలోనే భాగ్యనగరానికి తనేం పని మీద వచ్చాడో క్షణంపాటు గుర్తు చేసుకున్నాడు.

ఆనందరావు భీమవరంలో కాలేజీ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఇంటి రిజిస్ట్రేషన్ కోసం అన్నయ్యగారింటికి వచ్చాడు. ఉండే రెండ్రోజుల్లో చేయవలసిన పనులు బోలెడున్నాయి.

అవన్నీ గుర్తుకురాగానే ఆనందరావు భుజానికున్న ఎయిర్ బ్యాగ్ సరిచేసుకుని స్టేషన్ బయటికి వచ్చాడు. ఆటో ఎక్కాడు. సగందూరం వెళ్ళాక హఠాత్‌గా ఆనందరావుకు తన బ్రీఫ్‌కేస్ సంగతి గుర్తుకొచ్చింది. అతని గుండె గుభేల్‌మంది. రైల్వేస్టేషన్‌లో కాఫీ త్రాగినచోట క్రిందపెట్టి మర్చిపోయాడా బ్రీఫ్‌కేసు. అందులో ఇంటి డాక్యుమెంట్స్‌తో పాటు పదివేలు క్యాష్ కూడా ఉంది.

భీమవరంలో బయలుదేరినప్పుడు 'మీకసలే మతిమరుపు. బ్రీఫ్‌కేస్ జాగ్రత్త!' అని భార్య పదే పదే హెచ్చరించడం అతనికి తలపుకొచ్చింది. ఆనందరావు తన మతిమరుపును నిందించుకుంటూ రిస్ట్‌వాచ్ వంక చూసాడు. అప్పటికి స్టేషన్ విడిచి అరగంటయింది.

అతను ఆటోడ్రయివర్ విషయం చెప్పి వెనక్కు వెళ్ళమని చెప్పాడు. ప్రయాణీకులతో రద్దీగా ఉండే సికింద్రాబాద్ స్టేషన్‌లో బ్రీఫ్‌కేస్ దొరకడం కష్టమన్న సంగతి తెలిసినా ఏదో ఆశ మనసులో మిణుకు మిణుకుమంటూ మెరవసాగింది. ఆటో డ్రయివర్ కూడా 'బ్రీఫ్‌కేస్ దొరకడం కష్టం సాబ్! అదెప్పుడో స్టేషన్ దాటేసి ఉంటుంది' అన్నాడు.

ఆటో స్టేషన్ చేరడానికి మరో అరగంట పట్టింది. ఆనందరావు ఆటోడ్రయివర్‌కి డబ్బులిచ్చి పరుగులాంటి నడకతో స్టేషన్ లోపలకు వెళ్ళాడు.

కాఫీ త్రాగిన రెస్టారెంట్ దగ్గర వెదికాడు. అక్కడ లేదు బ్రీఫ్‌కేస్. ఆనందరావు అక్కడ ఇద్దరు, ముగ్గుర్ని విచారించాడు. ఎవరూ తమకు తెలీదని సమాధానమిచ్చారు. ఆనందరావు మనసు విషాదంతో నిండిపోయింది. డబ్బుపోయింది. అంతకంటే విలువైన డాక్యుమెంట్లు పోయాయి. రిజిస్ట్రేషన్ ఆగిపోతుందన్న నిజం అతన్ని బాధించింది.

స్టేషన్ బయటకు వచ్చాడు. అంతలోనే ఏదో ఆలోచన వచ్చి రైల్వే పోలీస్‌స్టేషన్ చేరాడు. అక్కడ ఎస్సైని కలిసి విషయం వివరించాడు.

ఎస్సై, ఆనందరావు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు. అతను పోగొట్టుకున్న బ్రీఫ్‌కేసు రంగు, సైజు, అందులో ఏమేం ఉన్నాయో వివరాలు వివరంగా అడిగి తెలుసుకున్నాడు.

ఆ తరువాత 'నాతోరండి' అని ఆనందరావు మరొక అధికారి వద్దకు తీసుకుపోయాడు. ఎస్సై చెప్పింది విన్న అధికారి ఆనందరావుకు ఒక బ్రీఫ్‌కేసు చూపించి 'అది మీరు తెరవగలరా?' అని అడిగాడు. అది ఆనందరావు పోగొట్టుకున్న బ్రీఫ్‌కేసే! ఆనందరావుకి చెప్పనలవికాని ఆనందం కలిగింది.

'తెరుస్తాను సార్! తాళం చెవి నాదగ్గరే ఉంది' అన్నాడు ఆనందరావు.

వాళ్ళు ఆనందరావుచేత కొన్ని కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని బ్రీఫ్‌కేస్ అతనికి అప్పగించారు. ఆనందరావు బ్రీఫ్‌కేస్ వాళ్ళ సమక్షంలోనే తెరిచిచూసాడు. డాక్యుమెంట్స్... క్యాష్ అన్నీ సక్రమంగా ఉన్నాయి.

అతను పోలీసు అధికారులతో 'థేంక్యూసర్స్. మీ డిపార్ట్‌మెంట్ సహాయం ఎనలేనిది. ఎప్పటికీ మరచిపోను' అని బయటకు వచ్చాడు. అతనితోపాటు బయటకు వచ్చిన పోలీసు కానిస్టేబుల్ 'సార్! మీరు థేంక్స్ చెప్పవలసింది మా డిపార్ట్‌మెంట్‌కి కాదు' అన్నాడు. 'మరెవరికి?' అన్నాడు ఆనందరావు అయోమయంగా.

'టెర్రరిస్టులకి చెప్పాలి. ఎందుకంటే బ్రీఫ్‌కేసుల్లో బాంబులుంచి ఢిల్లీ, బొంబాయి నగరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆ జాఢ్యం ఇక్కడి వరకూ పాకింది. ఎవ్వరైనా విడిచిపెట్టిన బ్రీఫ్‌కేసులు, సూట్‌కేసులూ ముట్టుకోవద్దనీ, పోలీసులకు సమాచారం అందించమనీ మైకుల్లో హెచ్చరిస్తున్నారు. అందుకే మీ బ్రీఫ్‌కేసు గురించి ఎవరో సమాచారం అందించారు. మానిపుణులు పరీక్షించి అందులో బాంబు లేదని నిర్ధారించి బ్రీఫ్‌కేసును పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు' సత్యం బోధించాడు పోలీస్ కానిస్టేబుల్. నిజం గ్రహించిన ఆనందరావు 'థేంక్స్ టు ది టెర్రరిస్ట్స్' అనుకుంటూ స్టేషన్ బయటకు నడిచాడు.

★